ప్రజాశక్తి
శుక్రవారం 17 ఫిబ్రవరి 2023 5 అనంతపురం

మండలి నామినేషన్లు మొదలు

తొలిరోజు రెండు దాఖలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం, కడప, కర్నూలు జిల్లాల పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గ శాసనమండలి ఎన్నికలకు సంబంధించి నామినేషన్లు దాఖలు ప్రక్రియ మొదలైంది. గురువారం నాడు రెండు నామినేషన్లు దాఖలైనట్లు రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ కేతన్ గార్గ్ తెలిపారు. పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున వెన్నపూస రవీంద్రారెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. ఉపాధ్యాయుల నియోజకవర్గానికి ఇండిపెండెంట్ అభ్యర్థిగా ఎంవి.రామచంద్రా రెడ్డి నామినేషన్ దాఖలు చేసినట్లు రిటర్నింగ్ అధికారి తెలిపారు.

ఓ స్వచ్ఛంద సంస్థ కార్యాలయం వద్ద ఆర్జేడీని అడ్డుకుంటున్న ఎస్‌ఎఫ్‌ఐ, ఎఐఎస్‌ఎఫ్ నాయకులు

ఎన్నికల వేళ ఆర్జేడీ మందు, విందు..!

స్వచ్ఛంద సంస్థ వసతి గృహంలో హైడ్రామా

ప్రయివేటు విద్యా సంస్థల యాజమాన్యంకు విందు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఒకవైపు పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గానికి ఎన్నికలు జరుగుతున్న సమయంలో విద్యాశాఖ ఉన్నతాధికారిగానున్న ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డి ప్రయివేటు విద్యా సంస్థల యజమాన్యాలకు విందు, మందు ఏర్పాటు చేయడం పెద్ద చర్చనీయాంశమైంది. విద్యార్థి సంఘం నాయకులు, పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డిలు ఈ విందు బాగోతాన్ని అడ్డుకునేందుకు వెళ్తే వారిపై తిరగబడటమే కాకుండా అతనే చొక్కాను చింపుకుని, ఏకంగా తనపై హత్యాయత్నం చేసే ప్రయత్నం చేసారంటూ బుకాయింపుకు దిగడం మరింత విస్మయాన్ని కలిగిస్తోంది. అధికారపార్టీ ఎమ్మెల్సీగానున్న కల్పలతారెడ్డి భర్త అయిన ప్రతాప్‌రెడ్డి ఎన్నికల ప్రక్రియ మొదలైన తరువాతనే రాయలసీమ ఆర్జేడీగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన నియామకం జరిగిన నాడే అనేక విమర్శలు సైతం వచ్చాయి. ఆ విమర్శలకు తగ్గట్టుగానే ఆయన వ్యవహరిస్తున్న తీరు బలాన్ని చేకూరుస్తోంది. పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభ, భయపెట్టి అధికారపార్టీకి అనుకూలంగా ఓట్లు వేయాలని ఒత్తిడి తెచ్చే ప్రయత్నాలు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. గురువారం రాత్రి ఒక స్వచ్ఛంద సంస్థకు సంబంధించిన అతిథి గృహంలో నగరంలోని కొన్ని విద్యా సంస్థ యజమానులకు విందుతోపాటు, మందు ఏర్పాటు చేశారు. ఎన్నికల్లో అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించాలని ఈ విందులో కోరినట్టు కూడా ప్రచారం జరుగుతోంది. ఇక్కడ జరుగుతున్న తంతును తెలియజేసేందుకు వెళ్లిన ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు పరమేష్, ఎఐఎస్‌ఎఫ్ నాయకులు కుళ్లాయప్ప, పిడిఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డిపై ప్రతాప్‌రెడ్డి తన ప్రతాపాన్ని చూపించే ప్రయత్నం చేశారు. తానే చొక్కాను చింపుకుని తనపై హత్యయత్నం చేయడానికి విచ్చేసారంటూ బుకాయించే ప్రయత్నం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడ విందు చేసుకుంటున్న ఓటర్లను ప్రలోభపెట్టే విధంగా వ్యవహరిస్తున్న వారిని వదిలేసి, ఇదేమిటని ప్రశ్నించడానికి వెళ్లిన ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు పరమేష్, ఎఐఎస్‌ఎఫ్ నాయకులు కుళ్లాయప్ప, తదితరులను అరెస్టు చేసి రాప్తాడు పోలీసు స్టేషన్‌కు రాత్రి సమయంలో తీసుకెళ్లారు. ఆర్జేడీ, పోలీసులు వ్యవహరించిన తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

ఎన్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ ప్రతాపరెడ్డి

ప్రభుత్వ అధికారా..? వైసిపి ఎన్నికల ఏజెంటా.?

సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పెద్ద ఎత్తున అక్రమాలకు ఉన్నత విద్యాశాఖ అధికారులే తెగబడడాన్ని సిపిఎం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. అధికార పర్యటన పేరుతో గురువారం నాడు అనంతపురంలో వైసిపి అభ్యర్థుల తరపున ప్రచారం చేస్తున్న ఆర్‌జెడి ప్రతాపరెడ్డి తీరును సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రభుత్వం పట్ల ఉన్న వ్యతిరేకత నుంచి బయటపడేందుకు విద్యాశాఖ కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్, ఎన్‌సిఈఆర్‌టి డైరెక్టర్ ప్రతాపరెడ్డి, ఎమ్మెల్సీ కల్పలతారెడ్డిల ద్వారా ఉపాధ్యాయులను బెదరిస్తున్నారని తెలిపారు. జిల్లాలోని ఒక ప్రముఖ స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో గురువారం రాత్రి ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులను పిలిపించుకుని ప్రతాపరెడ్డి మాట్లాడడం ఎన్నికల నియమావళిని ఉల్లంఘించడమే అన్నారు. దీన్ని ప్రశ్నించిన విద్యార్థి సంఘాల నాయకులపై దౌర్జన్యానికి దిగడం పట్ల ఎన్నికల సంఘం వెంటనే స్పందించి ప్రతాపరెడ్డిని విధులు నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. లేకుంటే దీనిపై పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

- 108 అంబులెన్స్‌లకు సుస్తి
- నిర్వహణ లేక మధ్యలోనే ఆగిపోతున్న వాహనాలు
- రోగులకు ప్రాణ సంకటం
- సిబ్బందికీ తప్పని ఇక్కట్లు

కుయ్..కుయ్ కాదు..

కుయ్యో.. మొర్రో..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చెప్పుకునే 108 వాహన సేవలకు సుస్తి చేసింది. కూయ్..కూయ్... అని వెళ్లాల్సిన ఈ వాహనాలు నిర్వహణ లేక కుయ్యో.. మొర్రో అంటున్నాయి. అత్యవసరంగా వైద్య సేవల కోసం ఎక్కిన రోగులకు వాహనం దయనీయ స్థితి చూసి ప్రాణ సంకటంగా మారుతోంది. ఆపత్కాలంలో ఆసుపత్రికి సకాలంలో చేరగలమా లేదా అన్న సందేహంతో రోగులు బిక్కుబిక్కుమనే పరిస్థితులు నెలకుని ఉన్నాయి. 15 నిమిషాల్లోపు వైద్యసేవలను దీని ద్వారా అందజేస్తామని ప్రభుత్వం గొప్పలు చెబుతున్నా... ఆసుపత్రికి చేరేలోపే వాహనం మధ్యలోనే ఆగిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. ఇందుకు తాజాగా ఉదాహరణ సాక్ష్యంగా నిలుస్తోంది. ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రిలో శ్వాసకోస సంబంధిత జబ్బుతో ఒక రోగి చేరాడు. ఆయనకు బుధవారం అర్థరాత్రి సమయంలో సమస్య తీవ్రమవడంతో వైద్యులు మెరుగైన చికిత్స కోసం అనంతపురం సర్వజన ఆసుపత్రికి రెఫర్ చేశారు. అతన్ని తీసుకుని కుటుంబ సభ్యులు 108లో ధర్మవరం నుంచి బయలుదేరారు. జాతీయ రహదారి 44 బెంగళూరు నుంచి హైదారాబాద్ వెళ్లే మార్గం గుండా అనంతపురం వైపు వస్తోంది. ఈ సమయంలో ఈ వాహనానికి హెడ్‌లైట్స్‌గానీ, రాత్రి సమయాల్లో అంబులెన్స్‌లకు వెలిగే బ్లింకర్సుగానీ, సైరన్ కూడా పనిచేయలేదు. చిన్న లైట్ల వెలుగులోనే ఈ వాహనం ఇబ్బందిపడుతూ వచ్చింది. దీన్ని ఒక సీనియర్ జర్నలిస్టు గమనించి ఆ వాహనం వెంట వచ్చి సమస్య గురించి అనంతపురం సర్వజన ఆసుపత్రి వద్ద ఆరా తీశారు. అప్పుడు ఈ వాహనాన్ని కున్న ఇబ్బందుల గురించి తెలిసిందని చెప్పారు. దీనిపై మరింతగా ఆరా తీయగా మరిన్న లోపాలు వెలుగు లోకి రావడం గమనార్హం. జిల్లాలో ప్రతి మండలా నికీ ఒక 108 వాహనం, పుర పాలక పట్టణా లకు నాలుగు చొప్పున ఉన్నాయి. అయితే వీటి నిర్వహణ మాత్రం అధ్వాన్నంగా ఉందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చాలా వాహనాలకు కనీసం ఉండాల్సిన స్టెప్నీ టైరు కూడా అందుబాటులో లేనట్లు ప్రజాశక్తి పరిశీలనలో తెలిసింది. నిర్వహణ కూడా సక్రమంగా లేకపోవడంతో వాహనాలు మధ్యమధ్యలోనే ఆగిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ రకంగా ఇటీవలి కాలంలో ఉరవకొండ, శెట్టూరు, కణేకల్ ప్రాంతాల్లో వాహనంలో రోగిని ఆసుపత్రికి చేర్చే సమయంలో మధ్యలోనే ఆగిపోయాయి. దీంతో చేసేది లేక రోగులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసకుని వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. రోగులు ఎలాగున్న సరే ముందు వాహనం గమ్యస్థానం చేరితే చాలు అన్న చందంగా మారింది.

సిబ్బందికీ తప్పని కష్టాలు

108 వాహనాలకే కాదు.. సిబ్బందికి ఇక్కట్లు తప్పడం లేదు. అనంతపురం జిల్లా పరిధిలో మొత్తం 260 మంది సిబ్బంది 108 సేవల్లో పనిచేస్తున్నారు. వీరికి సక్రమంగా వేతనాలు కూడా అందని పరిస్థితులు నెల కొన్నాయి. మూడు నెలలకు ఒకసారి వేతనాలు అందుతు న్నాయి. బకాయిలు జనవరి నెలలో పడటంతో కాస్త ఊపిరి పీల్చుకున్నారు. నిర్వహణ లేక వాహనాలు మధ్యలో ఆగిపోతుండటంతో ఆ భారాలు కూడా ఒక్కోసారి వారిపై పడు తుండటం గమనార్హం.

ఎప్పటికప్పుడు నిర్వహణ చేపట్టాలి

అనారోగ్య సమస్యల్లోనున్న వారిని సకాలంలో ఆసుపత్రికి చేర్చి, వారికి వైద్యమందివ్వడం ద్వారా ప్రాణాలను నిలుపవచ్చు. ఇంతటి మహోన్నతమైన పనిని చేసే 108 వాహనాలు, సిబ్బంది. దీన్ని ప్రభుత్వం కూడా ప్రతిష్టాత్మకంగానూ చేపట్టినట్టు చెబుతోంది. కాని ఆచరణలో చూసినప్పుడు వీటి నిర్వహణ పై ఏ మాత్రం దృష్టి సారించడం లేదు. దీంతో వాహనాలు మధ్యలోనే ఆగిపోతున్నాయి. ఈ సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలి. ఎప్పటికప్పుడు నిర్వహణ చేపట్టాలి. ఎంతో విలువైన సేవలందిస్తున్న సిబ్బందికీ వేతనాలను ఎప్పటికప్పుడు అందజేయాలి.

నాగమణి, సిఐటియు జిల్లా అధ్యక్షురాలు.

ప్రజల కోసం పోరాడే వారిని గెలిపించండి

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం



ఓటర్లతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గేయానంద్

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ ఎన్నికల్లో నిరంతరం ప్రజల కోసం పోరాడే వారిని గెలిపించాలని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ పిలుపునిచ్చారు. ఈమేరకు గురువారం తాడిపత్రి పట్టణ పరిసర ప్రాంతాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా జూనియర్ కళాశాల, ప్రభుత్వ పాఠశాల, రిజిస్టర్ కార్యాలయం, తహశీల్దార్ కార్యాలయం, ఎల్ఐసి ఆఫీస్ తదితర కార్యాలయాల్లో ఒక్కొక్కరిని కలిసి పిడిఎఫ్ బలపరిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు, టీచర్స్ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా పట్టణ పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు, టీచర్ల హక్కుల సాధనకు పోరాటం చేసే అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. 20 సంవత్సరాలుగా ప్రజా పోరాటంలో కొనసాగుతున్న పోతుల నాగరాజు, పేదల కోసం పోరాడుతున్న టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నర్సింహారెడ్డిని గెలిపించుకుంటే ఉద్యోగస్తులు, ఉపాధ్యాయుల గొంతును ప్రభుత్వానికి తెలియపరిచే అవకాశం ఉంటుందన్నారు. కావున పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, రాజారాంరెడ్డి, సిపిఎం మండల కార్యదర్శి జగన్‌మోహన్‌రెడ్డి, ఎస్‌ఎఫ్‌ఐ వరుణ్, రామ్మోహన్, హనుమంతురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆకులు కూడా కనిపించకుండా మామిడి చెట్టుకు పూసిన పూత

చెట్టంతా పూతే..

గోవిందరాయునిపేటలో కనువిందు చేస్తున్న మామిడి చెట్టు

ప్రజాశక్తి-శింగనమల

ఆ మామిడి చెట్టుకు అంతా పూతే పూసింది. కనీసం ఆకులు కూడా కనిపించకుండా పూత పూసిందంటే ఎలా ఉంటుందో అర్థం అవుతుంది. మండలంలోని గోవిందరాయుని పేటలో రైతు శివశంకర్‌రెడ్డి పొలంలో ఉన్న నాలుగు మామిడి చెట్లల్లో ఒక చెట్టుకు విపరీతంగా పూత పూసింది. దీనికితోడు రోడ్డు పక్కనే ఈ చెట్టు ఉండటంతో వాహనదారులు, పాదచారులు చూసి ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈసారి వర్షాలు అధికంగా కురవడంతో మామిడి చెట్టుకు అధిక పూత వచ్చిందని రైతు తెలిపారు. ఇదే పూత రాలకుండా ఉంటే దాదాపు 300 కిలోల వరకూ కాయలు వస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏదిఏమైనా రోడ్డుకు ఆనుకుని మామిడి చెట్టు ఉండటంతో అటుగా వెళ్లే ప్రతి ఒక్కరూ తమ వాహనాలను ఆపుకుని చెటును చూసి వెళ్తున్నారు.

నేటి యువతకు ఆదర్శం మహాకవి శ్రీశ్రీ

కార్యక్రమంలో మాట్లాడుతున్న హిందూపురం గవర్నమెంట్ గర్ల్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రగతి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

మహాకవి శ్రీశ్రీ రాసిన మహాప్రస్తానం నేటి యువతకు ఆదర్శనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో అనంతపురం నగరంలో డిగ్రీ కళాశాలలో శ్రీశ్రీ మహాప్రస్థానం నేటి పరిస్థితులు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు హిందూపురం గవర్నమెంట్ గర్ల్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రగతి, తెలుగు నూతన కవి నబీరసూల్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఓతురు పరమేష్, డివైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో జరిగినటువంటి అవాంతరాలపై యువతకు అవగాహన తీసుకుని రావడం కోసం శ్రీశ్రీ 1940లో మహాప్రస్థానం రాయడం జరిగిందన్నారు. శ్రీశ్రీ రచించిన మహాప్రస్థానం కవిత్వం వింటే ఉత్తేజ మవుతుందన్నారు. శ్రీశ్రీ తెలుగు సాహిత్య రంగానికి ఒక వేగుచుక్క అన్నారు. గతంలో అనేక మంది కవులు రచించిన రచనలు కవిత్వాలు కేవలం రాజుల కోసం, కోటల కోసం, దేవుళ్ల కోసం రచించారని తెలిపారు. కేవలం శ్రీశ్రీ మాత్రమే మనిషి జీవితం గురించి శ్రమ గురించి దోపిడీ గురించి కవిత్వం రచించిన గొప్ప మహాకవి శ్రీశ్రీ అన్నారు. ఈ కార్యక్రమంలో కెఎస్ఎన్ కళాశాల అధ్యాపక బందం తిమ్మారెడ్డి, రామాంజనేయులు, రామకష్ణ, శర్మ, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సూర్యప్రకాష్, విజయ్, రాజేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

లోకేష్ పాదయాత్రలో రాయదుర్గం టిడిపి నాయకులు

రాయదుర్గం : రాయదుర్గం టిడిపి నాయకులు యువనేత చేపట్టిన నారా లోకేష్ యువగళం పాదయాత్రలో మేము సైతం అంటూ వెంట నడిచారు. మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పలువురు నాయకులు పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు, జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు మల్లికార్జున, జిల్లా బీసీ సెల్ కార్యదర్శి భజంత్రీ కృష్ణ, రాయదుర్గం నియోజకవర్గ యువత కార్యనిర్వాహక కార్యదర్శి దాసరి సత్తి, 18వ వార్డు ఇన్‌ఛార్జి విజ్జి, రాయదుర్గం నియోజకవర్గ వాణిజ్య విభాగ సోషల్ మీడియా బంజోబా, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి

మాజీ ఎమ్మెల్యే విశ్వ, వైసిపి జిల్లా అధ్యక్షుడు పైలా

జగన్ స్టిక్కర్‌ను విడుదల చేస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి-ఉరవకొండ

సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు శ్రీనివాసులు, వైసిపి జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహ, యువనేత ప్రణయ్ రెడ్డి తెలిపారు. గురువారం విడపనకల్లు మండల కేంద్రంలోని సినిమా హాలులో జెసిఎస్ మండల కన్వీనర్ భరత్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వాలంటీర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వరరెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు, చిత్తూరు జెడ్పి ఛైర్మన్ శ్రీనివాసులు, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, యువనేత ప్రణయ్‌రెడ్డి హాజరయ్యారు. భవిష్యత్తులో పార్టీ పరంగా ప్రారంభించనున్న కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మార్చి 18 నుంచి 26 వరకు 'జగనన్నే మా భవిష్యత్తు' నినాదంతో గృహసారథులు, కన్వీనర్లు, వాలంటీర్లు గడప గడపకూ వెళ్లి గత ప్రభుత్వం, మన ప్రభుత్వం మధ్య వ్యత్యాసాన్ని వివరించాలన్నారు. వైసిపి ప్రభుత్వం అందించిన మెరుగైన పాలన, అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు తెలియచెప్పాలని సూచించారు. ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా దుష్ప్రచారాన్ని తిప్పికొడుతూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మళ్లీ వైసిపి అధికారంలోకి రావడమే ధ్యేయంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపిపి పుష్పావతి భీమ్‌రెడ్డి, జెడ్పిటిసి హనుమంతు, వైస్ ఎంపిపి సునీతరాణి, మండల కన్వీనర్ బసన్న, మాజీ జెడ్పిటిసి తిప్పయ్య, కొట్టాలపల్లి సర్పంచి మోదుపల్లి రామాంజనేయులు, జిల్లా అధికార ప్రతినిధి వీరన్న, నాయకులు కరణం భీమరెడ్డి, దేశాయ్ సిద్ధార్థ, విడపనకల్లు, కొట్టాలపల్లి పిఎసిఎస్ ఛైర్మన్లు శ్రీరాములు, నరేంద్రరెడ్డి, పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ గిరిబాబు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రమేష్, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసు నమోదు చేయాలని వినతి

ప్రజాశక్తి-గుంతకల్లు

గుంతకల్లు పట్టణంలో దారుణ హత్యకు గురైన జిపి. హేమకోటిరెడ్డి అంత్య క్రియల న్యూస్ కవర్ చేయడానికి వెళ్లిన పాత్రికేయులను పరుష పదజాలంతో దూషించిన కోటిరెడ్డి సోదరుడి కుమారుడు మంతకల్లు రెడ్డి పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని పాత్రికేయ సంక్షేమ సంఘం నాయకులు సిఐ గణేష్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్షుడు పి.శ్రీనివాసులు మాట్లాడుతూ ఎలాంటి లాభాపేక్ష లేకుండా సమాజ హితం కోసం, ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న పాత్రికేయులను మృతుడు కోటిరెడ్డి తమ్ముడు, కొడుకు మంతకల్లు రెడ్డి పత్రికల్లో రాయలేని రీతిలో దుర్భాషలాడడం క్షమార్హం అన్నారు. విలేకరి విలువ తెలియని ఇలాంటి మూర్ఖులపై తగు చర్యలు తీసుకోవాలని, కులం పేరుతో దూషించి నందున ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు ఉన్నారు.

ఎప్పుడొస్తారో తెలియదు..

సమయపాలన పాటించని సచివాలయ ఉద్యోగులు

ఖాళీ కుర్చీలతో దర్శనమిస్తున్న కార్యాలయాలు

ఖాళీ కుర్చీలతో దర్శనమిస్తున్న కుందుర్పి సచివాలయం

ప్రజాశక్తి-కుందుర్పి

సిఎం జగన్ ఎంతో ఉన్నతాశయంతో తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థ ఆయన ఆశయాలను నిర్వీర్యం చేస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎందుకంటే సచివాలయ సిబ్బంది ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు వెళ్తారో తెలియని పరిస్థితి నెలకొందని స్థానికులు వాపోతున్నారు. కొన్ని సచివాలయాల్లో పంచాయతీ కార్యదర్శికి కూడా విలువ ఇవ్వడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనల ప్రకారం సచివాలయ ఉద్యోగులు రోజుకు మూడుసార్లు వేలిముద్ర వేయాలి. అయితే ఎవరూ ఆ నిబంధన పాటించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పరవేక్షించాల్సిన మండల అభివృద్ధి అధికారి నిమ్మకు నీరెత్తిన విధంగా వ్యవహరించడంతోనే ఇలా సాగుతోందని విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సచివాయల సిబ్బంది సక్రమంగా విధులకు హాజరయ్యేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

నివాళి అర్పిస్తున్న దృశ్యం

ఎర్రినాగప్ప మృతి తీరనిలోటు

బుక్కరాయసముద్రం : గ్రామ పంచాయతీ కార్మికుడు నామాల ఎర్రినాగప్ప మృతి కార్మిక సంఘానికి తీరని లోటు పలువురు పేర్కొన్నారు. అనారోగ్యంతో పంచాయతీ కార్మికుడు ఎర్రినాగప్ప మంగళవారం మరణించారు. గురువారం యూనియన్ ఆధ్వర్యంలో సంతాప సభను నిర్వహించారు. ముఖ్య అతిథిగా కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప హాజరయ్యారు. ఎర్రినాగప్ప చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పంచాయతీ వర్కర్‌గా నామాల ఎర్రినాగప్ప విశేష సేవలు అందించారన్నారు. సిఐటియు కార్యకర్తగా పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అలుపెరుగని పోరాటం చేశారన్నారు. ఆయన మృతి కార్మిక సంఘానికి తీరని లోటు అన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు బి.ఎర్రినాగప్ప, బి.సుబ్రమణ్యం, సిఐటియు జిల్లా నాయకులు ఆర్.ఎర్రగొండ, ఎన్.నాగన్న, రామాంజనేయులు, వెంకటమ్మ, లక్ష్మీదేవి, సుబ్బరాయుడు, నాగేష్, కొండన్న, నాగరాజు, ముత్యాలు, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదు తనిఖీ

నార్పల : దుగుమర్రి గ్రామంలో రబీ పంట నమోదు కార్యక్రమాన్ని గుంటూరు వ్యవసాయ కమిషనరేట్ కార్యాలయం సహాయ వ్యవసాయ సంచాలకులు ఎ.మద్దిలేటి గురువారం పర్యవేక్షించారు. దుగుమర్రి రెవెన్యూలో మొక్కజొన్న, వేరుశనగ, టమోటా, అలసంద పంటల విస్తీర్ణం, నీటిపారుదల అవకాశాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు నారాయణస్వామి, మండల వ్యవసాయ అధికారి ముస్తఫా, విహెచ్ఎ గిరిధర్, నరేష్, ఉపేంద్ర, విఆర్ఒ లక్ష్మన్న, సర్వేయర్ పవన్ కుమార్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పప్పుశనగ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయండి

పుట్లూరు : పప్పుశెనగ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని బిజెపి ఆధ్వర్యంలో తహశీల్దార్ సుమతికి బుధవారం వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. మండలంలో వేల ఎకరాల్లో రైతులు పప్పుశెనగ పంట సాగుచేశారన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు లేక రైతులు నిరాశపడుతున్నారన్నారు. ఇప్పటివరకు మండలంలో పప్పుశెనగ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించలేదన్నారు. వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కుందూ శ్రీనివాసుల రెడ్డి, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు రాగేని రామాంజి యాదవ్, జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి కె.చంద్రశేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రామచంద్రారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

శంకర్ నాయక్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గురుకుల పాఠశాల తనిఖీ

బుక్కరాయసముద్రం : మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాలను ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్య శంకర్ నాయక్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తోందని, విద్యార్థులు దీనిని సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. హాస్టల్ విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు మోహన్ కుమార్, ఎంపీడీవో తేజోష్ణ, ఎంఇఒ గురు ప్రసాద్, ఎస్ఐ శివకుమార్ పాల్గొన్నారు.

ఖైదీలకు చికిత్సలు

శింగనమల : బుక్కరాయసముద్రం మండలం ఆరుబయలు కారాగారం ఖైదీలకు శింగనమల సిహెచ్‌సి జనరల్ సర్జన్ డాక్టర్ రమణా నాయక్ ఆధ్వర్యంలో గురువారం వైద్య పరీక్షలు నిర్వహించారు. జైలు సూపరింటెండెంట్ చిన్నారావు ఆదేశాల మేరకు 31 మంది ఖైదీలకు వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆరుబయలు కారాగారం సిఐ శివశంకర్, ఫార్మసిస్ట్ పవన్, ఎంఎన్ఒ నాగేంద్ర, ఖైదీలు పాల్గొన్నారు.

ఆరుబయట కారాగారంలో ఖైదీలు

విద్యార్థులకు వైద్యపరీక్షలు

ఉరవకొండ : రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వెంకటేష్ నాయక్ రాకెట్లలోని ఎస్సీ వెల్ఫేర్ బాలుర హాస్టల్ విద్యార్థులకు గురువారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ముందుగా విద్యార్థులకు ఆరోగ్య విషయాలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. వైద్య పరీక్షలు నిర్వహించి రక్తహీనతతో ఉన్న వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

ముఖహాజరు విధానాన్ని రద్దుచేయాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కసాపురం రమేష్

నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

ప్రజాశక్తి-గుంతకల్లు

మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు అమలు చేస్తున్న ముఖ హాజరు విధానాన్ని రద్దు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు కసాపురం రమేష్ డిమాండ్ చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు కసాపురం రమేష్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పర్మినెంట్ ఉద్యోగులతో పాటు ఒప్పంద కార్మికులకు కూడా ముఖ హాజరు విధానాన్ని అమలుచేయడం సరికాదన్నారు. ఈ విధానం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఒప్పంద కార్మికులు, మునిసిపల్ పర్మినెంట్ కార్మికుల్లో తీవ్ర ఆందోళన నెలకొందన్నారు. మున్సిపల్ సిబ్బందిలో అత్యధికంగా స్మార్ట్ ఫోన్‌లకు సంబంధించి నైపుణ్యం లేని కార్మికులు, ఫోన్లు లేని కార్మికులు ఎక్కువ మంది ఉన్నారన్నారు. వారికి చదువు కూడా అంతంత మాత్రమే అన్నారు. అటువంటి వారిని స్వయంగా ఎఫ్ఆర్ఎస్ తీసి పంపిస్తే హాజరు పడుతుందన్నారు. హాజరు పడితేనే జీతాలు వస్తాయని, ఉద్యోగాలు ఉంటాయని వారిని అధికారులు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని అన్నారు. తక్షణమే ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని నిలుపుదల చేయాలన్నారు. అదేవిధంగా పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, పట్టణ విస్తరణకు అనుగుణంగా అదనపు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు అనుబంధ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కె.నరసయ్య, సిఐటియు నాయకులు తిమ్మప్ప, మల్లికార్జున, రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

విడపనకల్ ఎఫ్ఎసిఎస్ సొసైటీ అభివృద్ధికి కృషిచేస్తాం

సొసైటీ ఛైర్మన్ బోయ శ్రీరాములు

మాట్లాడుతున్న ఛైర్మన్ బోయ శ్రీరాములు

ప్రజాశక్తి-ఉరవకొండ

విడపనకల్ ఎఫ్ఎసిఎస్ సొసైటీ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా ఉరవకొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి విశ్వేశ్వరరెడ్డి సహకారంతో కృషి చేస్తున్నట్లు ఆ సొసైటీ ఛైర్మన్ బోయ శ్రీరాములు పేర్కొన్నారు. గురువారం విడపనకల్ మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సొసైటీ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి వందలాది మంది రైతులకు ఒక్కొక్కరికి రూ.3 లక్షలు చొప్పున ఉరవకొండ ఎడిసిసి బ్యాంకులో వివిధ రకాల రుణాలు ఇప్పించినట్లు తెలిపారు. సొసైటీ కమిటీ సభ్యులతో పాటు సిబ్బందితో కలిసి రైతులను సమన్వయం చేసుకొని సొసైటీ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. పాల్తూరు ఎరువుల విక్రయ కేంద్రంలో దాదాపు రూ.2 కోట్లు ఎరువులను రైతులకు సరఫరా చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొచ్చామని చెప్పారు. గతంలో సొసైటీ పరిధిలో మాజీ సీఈవో ఆధ్వర్యంలో దాదాపు రూ.72 లక్షలు అక్రమాలు జరిగాయని, వాటిపై విచారణ చేపట్టాలని వ్యవసాయ శాఖ మంత్రికి సొసైటీ ఛైర్మన్ శ్రీరాములు ఫిర్యాదు చేయడంతో ఏమి చేయాలో దిక్కుతోచక రైతులను అడ్డుపెట్టుకొని బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ అందించే అన్ని రకాల పథకాలను రైతులకు అందించేలా కృషిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చీకలగురికి గ్రామ రైతులు శీన, మల్లి, చంద్ర, నాయుడు, లింగప్ప, సుధాకర్, మారుతి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛత స్ఫూర్తి తెచ్చేందుకు కృషి

శ్రమదానం చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-అనంతపురం

యువతలో స్వచ్ఛత స్ఫూర్తి తీసుకొచ్చేందుకే శ్రమధాన్ శివర్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాష్ట్రపతి అవార్డు గ్రహీత జీవన్ కుమార్ పేర్కొన్నారు. నెహ్రూ యువ కేంద్రం, భారత ప్రభుత్వం, విజన్ యూత్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రాజీవ్ కాలనీ నేషనల్ పార్కులో గురువారం శ్రమధాన్ శివర్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిధులుగా రాష్ట్రపతి అవార్డ్ గ్రహీత జీవన్ కుమార్, నేషనల్ పార్క్ ఎఒ కృష్ణప్రసాద్, ఎస్ఆర్ ఎడ్యుకేషన్ రాయల్ రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శ్రమదానం కార్యక్రమం వల్ల మానసిక, శారీరక వికాసం కలుగుతుందన్నారు. మారుతున్న సమాజంలో ప్రతి ఒక్కరూ ఏదో ఒక విధంగా పబ్లిక్ స్థలాల్లో శ్రమదానం చేస్తూ స్వచ్ఛ భారత్ నిర్మాణానికి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం, విజన్ యూత్ అసోసియేషన్, ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

నార్పల : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపిపి నాగేశ్వరరావు అధ్యక్షతన శుక్రవారం ఉదయం 10 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో దివాకర్ తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా కలెక్టర్ ప్రత్యేక అనుమతి తీసుకుని సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నామని చెప్పారు. సర్పంచులు, ఎంపిటిసిలు, వివిధ శాఖల అధికారులు సమావేశానికి హాజరుకావాలన్నారు.

ఫార్మా-డీ విద్యార్థులు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలి

జేఎన్టీయూ ఉపకులపతి ఆచార్య రంగజనార్ధన

బహుమతులు అందజేస్తున్న విసి రంగజనార్ధన

ప్రజాశక్తి-అనంతపురం

ప్రపంచ వ్యాప్తంగా ఫార్మా-డి కోర్సు అధిక ప్రాధాన్యత సంతరించుకుందని, అందుకు తగ్గట్టుగా ఫార్మ-డి విద్యను అభ్యసించే విద్యార్థులు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని జేఎన్టీయూ ఉపకులపతి ఆచార్య రంగజనార్ధన పిలుపునిచ్చారు. గురువారం స్థానిక జేఎన్టీయూ అనుబంధ తైల సాంకేతిక పరిశోధన సంస్థ (ఒటిపిఆర్ఐ) కళాశాల ఆధ్వర్యంలో రెండవ బ్యాచ్ ఫార్మా-డి విద్యార్థులకు ఒటిపిఆర్ఐ డైరెక్టర్ ఆచార్య బి.దుర్గాప్రసాద్ అధ్యక్షతన స్వాగత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉపకులపతి ఆచార్య జి.రంగజనార్ధన హాజరు కాగా విశిష్ట అతిథిగా వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య సి.శశిధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపకులపతి రంగజనార్ధన మాట్లాడుతూ ఫార్మా-డి విద్యార్థులు నైపుణ్యాలకు అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఔషధ శాస్త్రంలో కృత్రిమ మేధస్సు, యంత్ర అభ్యసనం ప్రాధాన్యతను వివరించారు. అందుకు అనుగుణంగా సంస్థలో డిజిటల్ ఫార్మసీ ల్యాబ్‌ను ఏర్పాటు చేశామని, పరిశోధనా కార్యక్రమాలను విస్తృతం చేయాలని తెలిపారు. అనంతరం రిజిస్ట్రార్ ఆచార్య సి.శశిధర్ మాట్లాడుతూ ఫార్మా-డి విద్యార్థులు కోవిడ్ సమయంలో విశిష్ట సేవలు అందించారన్నారు. విద్యార్థులు అందుబాటులో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో నిరంతరం నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని సమాజాభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఒటిపిఆర్ఐ డైరెక్టర్ ఆచార్య దుర్గాప్రసాద్ మాట్లాడుతూ భవిష్యత్తులో విద్యార్థులు ఉద్యోగార్జనే ధ్యేయంగా కాకుండా ఉద్యోగాలను కల్పించే వ్యక్తులుగా రూపొందాలని ఆకాంక్షించారు. విద్యార్థులు సర్వతోముఖాభివృద్ధికి తమ వంతు కర్తవ్యాన్ని నిర్వర్తించాలని, పట్టుదలతో విద్యనభ్యసించి ఉన్నత స్థానానికి చేరుకోవాలని సూచించారు. అనంతరం వివిధ పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఫార్మా-డి లోగోను ఆవిష్కరించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.గోపీనాథ్, ఫార్మా-డి ఉపాధ్యాయులు డాక్టర్ పవన్‌కుమార్, డాక్టర్ శ్రావణ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నేటి తరాల నాయకులకు శ్రీకృష్ణదేవరాయలు ఆదర్శం

డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య

ప్రజాశక్తి-అనంతపురం

నేటి తరాల నేతలకు శ్రీ కృష్ణదేవరాయలు ఆదర్శమని డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య అన్నారు. నగరంలోని శ్రీ కృష్ణదేవరాయ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో శ్రీ కృష్ణదేవరాయలు జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, అనంతపురం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ వైస్ ఛైర్మన్ రమణయ్య, కార్పొరేటర్ సాకే చంద్రశేఖర్, ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకులు సుంకర రమేష్ హాజరయ్యారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్యామ్ ఆధ్వర్యంలో వారు శ్రీ కష్ణదేవరాయలు విగ్రహానికి పాలాభిషేకం చేశారు. పూల మాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ శ్రీ కృష్ణదేవరాయలు జయంతిని ఆయన పేరున ఏర్పాటు చేసిన పాఠశాలలో జరుపుకోవడం సంతోషదాయకమని అన్నారు. కృష్ణదేవరాయలు పరిపాలన నేటి తరాలకు కూడా ఆదర్శమన్నారు. కృష్ణదేవరాయలు మరణించి దాదాపు 500 సంవత్సరాలు అయినా నేటికీ ఆయన పరిపాలనను స్మరించడం గొప్ప విషయమన్నారు. అలాంటి మహనీయుడి జయంతిని జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి లిజి, నందిత, జన జాగృతి సొసైటీ అధ్యక్షుడు వెంకటేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్‌కెయులో..

ఎస్‌కె యూనివర్శిటీలో..

ఎస్కేయూ భువన విజయం ఆడిటోరియంలో శ్రీ కృష్ణదేవరాయల జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉపకులపతి ఆచార్య రామకృష్ణారెడ్డి శ్రీకృష్ణదేవరాయలు విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం భువన విజయం ఆడిటోరియంలో విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో రెక్టార్ మల్లికార్జునరెడ్డి, రిజిస్ట్రార్ లక్ష్మయ్య, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

గుత్తి : స్థానిక తాడిపత్రి రోడ్డులో ఉన్న శ్రీ కృష్ణదేవరాయలు విగ్రహానికి మాజీ సర్పంచి పగడాల రమణ, బలిజ సంక్షేమ సంఘం నాయకులు ఆముదాల గిరిధర్, పగడాల శ్రీనివాసులు ఎ.బాలరాజు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. బలిజ సంక్షేమ సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఎం.రమణ, రామానాయుడు, ఉపాధ్యక్షులు శ్రీకరం గోవిందరాజులు, కోశాధికారి మంజు, నాయకులు చిరంజీవి, దేవేంద్ర, సురేష్, నిరంజన్, అరుణ్ కుమార్, రవి, గోపి, గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు. బసినేపల్లి గ్రామంలో బలిజ సంఘం నాయకులు శ్రీకృష్ణదేవరాయల చిత్రపటానికి పూలమాలలేసి నివాళి అర్పించారు. అన్నదానం చేశారు. కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు గోరంట్ల మల్లికార్జున, పులికొండ తదితరులు పాల్గొన్నారు.

గుత్తిలో కేక్ కట్‌చేస్తున్న బలిజ సంఘం నాయకులు

'అనంతలక్ష్మి'లో పెట్టుబడులపై అవగాహన సదస్సు

అనంతపురం : అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాలలో ఎంబిఎ విద్యార్థులకు పెట్టుబడులపై అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఫైనాన్షియల్ ఎడ్యుకేషన్ రిసోర్స్‌పర్సన్ హాజరై మాట్లాడారు. భవిష్యత్తులో పొదుపు చాలా అవసరమన్నారు. షేర్ మార్కెట్స్, మ్యూచువల్ ఫండ్స్, బ్యాంక్ డిపాజిట్స్ ఇన్సూరెన్స్ విభాగాల్లో పెట్టుబడులు ఏ విధంగా ఉపయోగ పడతాయో తెలియజేశారు. ఎంబిఎ విభాగాధిపతి చక్రధర్ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థీ మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా ముందుకు సాగాలన్నారు. నైపుణ్యాలను పెంపొందించుకొని ఉత్తమ పారిశ్రామిక వేత్తలుగా, పెట్టుబడిదారులుగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ అనంత రాముడు, ప్రిన్సిపల్ మూర్తిరావు ఖోకలే, నైపుణ్యాభివృద్ధి సంచాలకులు సురేంద్ర నాయుడు, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న విద్యార్థులు

ఎస్‌కెయు ఇంజినీరింగ్ కళాశాలలో రక్తదాన శిబిరం

అనంతపురం : రక్త దానంతో ఆపదలో ఉన్న వారిని కాపాడొచ్చునని, అందుకు ప్రతి ఒక్కరూ మూడు నెలలకు ఒకసారి రక్తం దానం చేయాలని ఎస్‌కెయు ఉపకులపతి ఆచార్య రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ఎస్‌కెయు ఇంజినీరింగ్ కళాశాలలో బ్లడ్ గ్రూపింగ్, డొనేషన్ క్యాంప్ నిర్వహించారు. ఎస్‌కెయు ఉపకులపతి ఆచార్య రామకృష్ణారెడ్డి, మానవతా అమర్నాథ్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రక్త గ్రూపు నిర్ధారణ, రక్త దానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు సుమారు 50 యూనిట్లు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర, ఎంఎస్ఎస్ వాలంటరీలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

కారు..టాటా ఏస్ వాహనాలు ఢీ..

ఏడుగురికి గాయాలు

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని బళ్లారి రోడ్డు వాల్మీకి నగర్ వద్ద కారు, టాటా ఏస్ వాహనాలు ఢీకొనడంతో టాటా ఏస్‌లో వెళ్తున్న ఏడుగురికి స్వల్ప గాయాలయ్యాయి. గురువారం సాయంత్రం కర్ణాటక రాష్ట్రంలోని రప్పం గ్రామానికి చెందిన దినసరి భవన నిర్మాణ కార్మికులు రాయదుర్గంలో పని ముగించుకుని టాటాఏస్ వాహనంలో స్వగ్రామానికి వెళ్తుండగా ఎదురుగా వచ్చిన కారు ఢీకొంది. దీంతో ముందు పెడుతున్న ఎద్దుల బండిని ఢీకొంది. ఈ ఘటనలో టాటా ఏస్ వాహనంలో ప్రయాణిస్తున్న ఏడుగురు కార్మికులకు గాయాలయ్యాయి. ఓ ఎద్దు కూడా గాయపడింది. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు.

అప్పులబాధతో యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-రొద్దం

అప్పుల బాధతో యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొన్న సంఘటన మండలంలోని పెద్దకొడిపల్లిలో గురువారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బోయ శంకర్ (42) అప్పుల బాధతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ నాగస్వామి తెలిపారు. మృతుని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

నాటుసారా పట్టివేత

ప్రజాశక్తి-రొద్దం :

మండలంలోని కొగిర గ్రామంలో నాటు సారా అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ నాగస్వామి తెలిపారు. తమకు వచ్చిన సమాచారం మేరకు తమ సిబ్బంది దాడులు నిర్వహించిందన్నారు. గ్రామానికి చెందిన నరసింహులు అనే వ్యక్తి స్కూటీలో 20 లీటర్ల సాటుసారా తీసుకెళుతుండగా సీజ్ చేసినట్లు చెప్పారు. నాటుసారా, స్కూటీని సీజ్ చేసి నిందితుడిని రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసులు మహేష్, పోతన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం

రూ.3 లక్షల ఆస్తి నష్టం

ప్రజాశక్తి-పుట్లూరు

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధమై రూ.3 లక్షలు ఆస్థి నష్టం వాటిల్లిన సంఘటన పుట్లూరు మండలం కోమటికుంట్ల గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల మేరకు.. కోమటికుంట్ల గ్రామానికి చెందిన పెద్దయ్య వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం ఇంటి వెనుక ఉన్న తోటలో చెత్తాచెదారానికి నిప్పుపెట్టాడు. ప్రమాదవశాత్తు మంటలు ఇంట్లోకి వ్యాపించాయి. సమాచారాన్ని పెద్దయ్య ఫోన్ ద్వారా తెలియజేశారు. గ్రామస్తులు వచ్చేటప్పటికే మంటలు ఇళ్లంతా వ్యాపించి వస్తువులన్నీ కాలిపోయాయి. సుమారు రూ.3 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

పండ్లతోట అగ్నికి ఆహుతి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

పండ్ల తోట అగ్నికి ఆహుతి అయిన సంఘటన బుక్కరాయసముద్రం మండలం నీలంపల్లి గ్రామంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. గుర్తు తెలియని వ్యక్తులు పండ్ల తోటలకు నిప్పు పెట్టడంతో మామిడి చెట్లు, సపోటా చెట్లు దెబ్బ తినడమే కాకుండా డ్రిప్, బిందు పరికరాలు కాలిపోయాయి. రూ.లక్షల్లో నష్టం వాటిల్లిందని బాధిత రైతు సిద్ధయ్య తెలిపారు. తోటకు నిప్పుపెట్టిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని రైతు కోరాడు.

ఓబుల దేవర చెరువు : మండలంలోని ఆకుతోటి పల్లి వద్ద గురువారం జరిగిన అగ్నిప్రమాదంలో ఓడి చెరువు గ్రామానికి చెందిన మనోహర్ అనే రైతుకు చెందిన మామిడి, జామ తోట దగ్ధమైంది. ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న మామిడి, జామ, అల్లనేరేడు తోట అగ్నిప్రమాదంలో దగ్ధమైందని బాధితుడు వాపోయాడు. గుర్తుతెలియని వ్యక్తులు ఎండుగడ్డికి నిప్పు పెట్టడంతో మంటలు వ్యాపించి 100 జామ, 50 మామిడి, 60 అల్లం నేరేడు చెట్లతో పాటు డ్రిప్, స్ప్రింక్లర్ల పైపులు కాలిపోయాయన్నారు. దీంతో తనకు మూడు లక్షల రూపాయల నష్టం వాటిల్లిందన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు.

పప్పుశనగ పంటకు నిప్పు

ప్రజాశక్తి-ఉరవకొండ

ఆరుగాలం శ్రమించి.. కంటికి రెప్పలా కాపాడిన పంటను ఒక దగ్గర చేర్చిన రైతు ఆశలను గుర్తు తెలియని దుండగులు అడియాశలను చేశారు. పప్పుశనగ వామికి నిప్పు పెట్టి దాదాపు రూ.10లక్షల విలువజేసే పంటను దగ్ధం చేశారు. వివరాల్లోకి వెళ్తే... ఉరవకొండ మండలం ఆమిద్యాల గ్రామంలో రైతు శ్రీనివాస్‌రెడ్డి పదెకరాల్లో పప్పుశనగ పంట సాగు చేశాడు. పంట సైతం బాగానే రావడంతో మొత్తం పీకించి వామి వేసుకున్నాడు. మరో రెండురోజుల్లో పంటను వేరు చేసే యంత్రం ద్వారా ధాన్యాన్ని సేకరించాలని అనుకున్నాడు. అంతలోనే గుర్తుతెలియని దుండగులు అర్ధరాత్రి సమయంలో నిప్పుపెట్టారు. రాత్రి 10 గంటల వరకు వామి దగ్గరే ఉన్న శ్రీనివాసరెడ్డి భోజనం చేద్దామని ఇంటికి వెళ్లి తిరిగి వచ్చేలోపు ఇలా చేశారని బాధిత రైతు వాపోయాడు. వెంటనే ఉరవకొండ ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. వారు వచ్చి మంటలను అదుపు చేశారు. లేకుంటే పక్కనే ఉన్న ఇతర రైతుల పప్పుశనగ వాములకు నిప్పు అంటుకుని మరింత నష్టం జరిగేదని స్థానికులు చెబుతున్నారు. పప్పుశనగ వామి దగ్ధమవడంతో పంటకు తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమను ఆదుకోవాలని రైతు విజ్ఞప్తి చేశాడు.

దర్గాహొన్నూరులో ప్రత్యేక ప్రార్థనలు

బొమ్మనహాల్ : మండలంలోని దర్గాహొన్నూరు గ్రామంలో వెలసిన శర్మస్‌వలి దర్గాలో గురువారం ప్రత్యేక ప్రార్థనలు, చదివింపులు నిర్వహించారు ముందుగా స్వామివారి దర్గాకు ప్రత్యేక గల్ఫ్‌లు ఏర్పాటు చేయడంతోపాటు సుగంధ ద్రవ్యాలను వెదజల్లి చదివింపులు చేశారు. అనంతరం కందూరు ఏర్పాటు చేసి భక్తులకు ఉచితంగా పంపిణీ చేసినట్లు దర్గా ముతవల్లి తెలిపారు.

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు నిర్వహిద్దాం

ఇన్‌ఛార్జి కలెక్టర్ కేతన్ గార్గ్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఫిబ్రవరి 20 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేలా అన్ని ఏర్పాట్లూ పూర్తి చేయాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ కేతన్‌గార్గ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇంటర్ పరీక్షలకు సంబంధించి గురువారం ఆయన పలు విషయాలను తెలియజేశారు. ముందుగా ఒకేషనల్ విద్యార్థుల ప్రాక్టికల్స్ పరీక్షలు ఫిబ్రవరి 20న ప్రారంభమై మార్చి 07న ముగుస్తాయన్నారు. రెగ్యులర్ విద్యార్థుల ప్రాక్టికల్స్ ఫిబ్రవరి 26 నుంచి మార్చి 07 వరకూ జరుగుతాయన్నారు. జిల్లాలో 83 కేంద్రాల్లో ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహించనున్నామన్నారు. ప్రాక్టికల్స్ పరీక్షలు పూర్తయిన వారం రోజుల తర్వాత మార్చి 15 నుంచి థియరీ పరీక్షలు ప్రారంభమవుతాయన్నారు. మొత్తం 60 కేంద్రాల్లో థియరీ పరీక్షలు ఏప్రిల్ 04 వరకూ కొనసాగుతాయన్నారు. విద్యార్థుల జీవితాల్లో ఇంటర్మీడియట్ పరీక్షల ప్రాధాన్యత దష్ట్యా పరీక్షా కేంద్రాల రూట్లలో సమయానికి బస్సులు నడుపనున్నామన్నారు. వేసవిని దష్టిలో ఉంచుకుని కేంద్రాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామన్నారు.

జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు రాయనున్న విద్యార్థులు

మొదటి సంవత్సరం విద్యార్థులు
రెగ్యులర్ -17,319
ఒకేషనల్-1280
మొత్తం - 18599

రెండవ సంవత్సరం విద్యార్థులు
రెగ్యులర్ -20,977
ఒకేషనల్ - 1610
మొత్తం - 22,587